

ప్రజా న్యూస్

— నెటవర్క్ —

నిజం.. సమాజం.. ప్రజా కోసం.. || తెలుగు దినపత్రిక ||



తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 175,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,బుధవారం , తేదీ : 28-10-2026

మొదలైన తుపాను ప్రభావం.. విశాఖలో విరిగిపడుతున్న చెట్లు, ఉత్తరాంధ్రలో హై అలర్ట్



ఉత్తరాంధ్రపై అర్ణబ్ తుపాను పంజా

విశాఖలో ఈదురుగాలులకు నేలకూలిన చెట్లు, బీచ్‌ల మూసివేత

యానాం సమీపంలో రేపు తీరం దాటనున్న అతి తీవ్ర తుపాను

కోస్తా జిల్లాల్లో స్కూళ్లకు సెలవులు, సహాయక కేంద్రాల ఏర్పాటు

ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ప్రభుత్వ ఆదేశాలు

అమరావతి : అర్ణబ్ తుపాను ప్రభావం ఉత్తరాంధ్ర జిల్లాలపై, ముఖ్యంగా విశాఖపట్నంపై స్పష్టంగా కనిపించడం ప్రారంభమైంది. మంగళవారం ఉదయం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షం నగరంలోని పలు ప్రాంతాలను ముంచెత్తింది. గాలి తీవ్రతకు మహారాణిపేట అంగడిదిబ్బ వద్ద ఓ చెట్టు విరిగి పాన్ షాపుపై పడటంతో అది ధ్వంసమైంది. రామ్ నగర్ సేవాసదన్ స్కూల్ సమీపంలో మరో చెట్టు రోడ్డుకు అడ్డంగా కూలిపోవడంతో మిగతా..2లో

తెలంగాణపై అర్ణబ్ తుపాను ప్రభావం - ఆ 4 ఉమ్మడి జిల్లాల్లో అతి భారీ వర్షాలు



ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది.

ఢిల్లి : బంగాళాఖాతంలో ఏర్పడిన అర్ణబ్ తుపాను తెలంగాణలో మంగళవారం నుంచి ప్రభావం చూపే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నేడు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది.

28వ తేదీన తీరం దాటే అవకాశాలు మిగతా..2లో

ఎల్‌నినో ప్రభావంతో అన్ని ప్రాజెక్టులు ఎండిపోయే ప్రమాదం



- ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో అన్ని ప్రాజెక్టులు ఎండిపోయే ప్రమాదం ఉందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు.
- రైతులు చాలా అనుభవజ్ఞులని..ఈ కరువుపై దృష్టి పెట్టి రెండో పంటను వేయొద్దని కోరారు.

సంగారెడ్డి జిల్లా, అక్టోబరు 27 : ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో అన్ని ప్రాజెక్టులు ఎండిపోయే ప్రమాదం ఉందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రైతులు చాలా అనుభవజ్ఞులని.. ఈ కరువుపై దృష్టి పెట్టి రెండో పంటను వేయొద్దని కోరారు. ప్రతిపక్షాలు కూడా ఉన్న వాస్తవాన్ని

తెలంగాణకు పెట్టుబడులపై ఫోకస్.. గ్లోబల్ సమ్మిట్‌తో

రేవంత్ సర్కార్ భారీ ప్లాన్!

- రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు.
- ఈ నేపథ్యంలోనే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్
- 2026ను తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనుంది.



హైదరాబాద్, అక్టోబరు 27 : రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ ఇందులో భాగంగానే ఈ సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం చేస్తోంది. ఈ సమ్మిట్‌కు 550కు పైగా దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలకు ఆహ్వానాలను అందించారు. అక్టోబరు 29వ తేదీన న్యూఢిల్లీలో గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ జరగనుంది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. వివిధ దేశాల రాయబారులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలకు తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానించనున్నారు. తెలంగాణకు భారీ పెట్టుబడులే లక్ష్యంగా గ్లోబల్ సమ్మిట్‌ను రేవంత్ సర్కార్ నిర్వహించనుంది. ప్రధాన సమ్మిట్‌కు 1,500కు పైగా కంపెనీలు, మిగతా..2లో

తెలంగాణలో 1.90 లక్షల మంది

మహిళలకు కుట్టు మిషన్లు



- బీసీ సంక్షేమ శాఖ, విద్యా నిధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.
- బీసీ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్, అక్టోబర్ 27: బీసీ సంక్షేమ శాఖ, విద్యా నిధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ (మంగళవారం) సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. 38 బీసీ ఆత్మగౌరవ భవనాల జీవోల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. డిసెంబర్ 9న మహిళలకు మిగతా..2లో

కేటీఆర్, హరీశ్ రావు

భ్రమల్లో ఉన్నారు



- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుస్తుందని మహేశ్ గౌడ్ ధీమా
- తెలంగాణలో బీజేపీ పని అయిపోయిందని వ్యాఖ్య
- ఆలోచన లేకుండా అప్పులు చేసి కేసీఆర్ రాష్ట్రాన్ని ముంచారని ఆరోపణ

హైదరాబాద్: బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు ఇంకా భ్రమల్లోనే జీవిస్తున్నారని,

జర్నలిజానికి డేటా చట్టం ముప్పు.. సుప్రీంకోర్టును

ఆశ్రయించిన మీడియా సంస్థలు

- డిజిటల్ డేటా పరిరక్షణ చట్టంపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన మీడియా సంస్థలు
- జర్నలిజానికి మినహాయింపులు లేకపోవడంపై తీవ్ర ఆందోళన
- దర్యాప్తు జర్నలిజానికి, సోర్సుల గోప్యతకు ప్రమాదమని పిటిషన్‌లో వాదన
- పిటిషన్‌పై స్పందించాలని కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు
- తదుపరి విచారణను నవంబర్ 17కు వాయిదా వేసిన ధర్మాసనం



ఢిల్లి : డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం, 2023లోని కీలక నిబంధనలు జర్నలిజం మనుగడకే ప్రమాదకరంగా మారాయంటూ దేశంలోని ప్రముఖ మీడియా సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం, మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. జర్నలిజానికి ప్రత్యేక మినహాయింపులు ఇవ్వకపోవడం వల్ల దర్యాప్తు కథనాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని, ప్రచురితమైన వార్తలను తొలగించాల్సి వస్తుందని, రహస్య సోర్సుల వివరాలు బయటపెట్టాల్సి వస్తుందని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని 21 ప్రముఖ మీడియా సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ (ఎన్‌బీడీఏ) ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, మిగతా..2లో

ఎన్నికల్లో నెతన్యాహు ఓడితే యుద్ధం ఆగుతుందా?

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు, కొత్త ఇజ్రాయెల్ ప్రభుత్వ కూర్పు ఈ పరిణామాల్లో కీలకంగా మారనున్నాయి.
- ఇరాన్‌పై తదుపరి సైనిక చర్యలకు తన నాయకత్వమే అమెరికా మద్దతును సాధించగలదని నెతన్యాహు ప్రచారం చేస్తున్నారు.



ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ఎన్నికల్లో ఓడిపోతే ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతలు తగ్గేందుకు, దౌత్య చర్చలకు అవకాశాలు పెరిగేందుకు మార్గం ఏర్పడవచ్చని విశ్లేషణలు సూచిస్తున్నాయి. అయితే, ఆయన ఓటమి వల్ల ఇరాన్‌పై ఇజ్రాయెల్ వైఖరి పూర్తిగా మారిపోతుందని చెప్పలేం. ప్రతిపక్ష నేత గాది ఐసెన్‌కోట్ అధికారంలోకి వచ్చినా, ఇరాన్ సైనిక సామర్థ్యాలను అడ్డుకోవడం, దాని అణు కార్యక్రమంపై ఒత్తిడి కొనసాగించడం వంటి లక్ష్యాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు, కొత్త ఇజ్రాయెల్ ప్రభుత్వ కూర్పు ఈ పరిణామాల్లో కీలకంగా మారనున్నాయి. హమాస్ నేతృత్వంలో 2023 అక్టోబర్ 7న జరిగిన దాడి, ఆ తర్వాత గాజా, లెబనాన్, ఇరాన్‌లలో చోటుచేసుకున్న యుద్ధాల అనంతరం ఇజ్రాయెల్‌లో జరుగుతున్న తొలి జాతీయ ఎన్నికలు ఇవి. ఇరాన్‌పై తదుపరి సైనిక చర్యలకు తన నాయకత్వమే అమెరికా మద్దతును సాధించగలదని నెతన్యాహు ప్రచారం చేస్తున్నారు. ఫిబ్రవరిలో ప్రారంభించిన చర్యలను పూర్తి చేయాల్సి ఉందని ట్రంప్ కూడా ఇజ్రాయెల్ ఓటర్లకు పిలుపునిచ్చారు. మిగతా..2లో

స్థానిక ఎన్నికలపై పవన్ కీలక వ్యాఖ్యలు..

రెబల్స్‌కు స్పష్టమైన హెచ్చరిక జారీ



- పార్టీ బీఫామ్ ఇచ్చినవారే అధికారిక అభ్యర్థులన్న పవన్ కల్యాణ్
- మిగిలిన వారు నామినేషన్లు ఉపసంహరించుకోవాలని సూచన
- కూటమి స్ఫూర్తితో అధికారిక అభ్యర్థుల గెలుపుకు పనిచేయాలని పిలుపు

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పొత్తులో భాగంగా పార్టీ అధికారికంగా బీఫామ్ జారీ చేసినవారే కూటమి అభ్యర్థులని, నామినేషన్లు వేసిన ఇతరులు వాటిని ఉపసంహరించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. కూటమి స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. సీట్ల సర్దుబాటు ప్రక్రియ ఒక సవాల్ లాంటిదని,

కాకినాడకు 167 కి.మీ. దూరంలో 'అర్ణబ్..

అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

- అర్ణబ్ తుపాను ముప్పుపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- కాకినాడ సమీపంలో కేంద్రీకృతమైన తుపాను
- లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించాలని కలెక్టర్లకు ఆదేశం
- సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బలగాల వినియోగం
- విద్యుత్, రవాణా పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచన



అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వేగంగా కదులుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తుఫాను ప్రస్తుత పరిస్థితి, ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధత, ముందస్తు చర్యలపై అధికారులకు ఆయన కీలక దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ఈ తుపాను కాకినాడ సమీపంలోని యానాంకు 167 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని, గత ఆరు గంటలుగా గంటకు 23 కిలోమీటర్ల వేగంతో తీరం వైపు దూసుకొస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాలపై తుపాను ప్రభావం, భారీ వర్షాల హెచ్చరికల గురించి సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిగతా..2లో

పోలింగ్ రోజున పులివెందులలో ఉంటా..

భయపడొద్దు.. తిరగబడండి



- ఈ రెండేళ్లు ఓపిక పడితే వచ్చేది జగన్ 2.0 అన్న జగన్
- అన్యాయం చేసిన అధికారులను వడ్డీతో సహా చెల్లించేలా చేస్తామని హెచ్చరిక
- పులివెందులలో కార్యకర్తలపై చేయి వేస్తే తనపై వేసినట్లేనని స్పష్టీకరణ

అమరావతి: "ఈ రెండేళ్లు ఓపిక పట్టండి.. వచ్చేది జగన్ 2.0" అని పార్టీ శ్రేణులకు వైసీపీ అధినేత జగన్ పిలుపునిచ్చారు. పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఆయన... అధికార కూటమిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పులివెందుల నుంచి మొదలయ్యే ధ్వని రాష్ట్రమంతా వినిపించాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని తుడిచిపెట్టేస్తామని ధీమా వ్యక్తం చేశారు. "మా టైమ్ వచ్చినప్పుడు, చట్టాన్ని మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

కాకినాడకు 167 కి.మీ. దూరంలో 'అర్ణబ్..

అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

సమీక్ష అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో బాధితులకు అవసరమైన ఆహారం, తాగునీరు, ఇతర సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. తుపాను ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని, ఈదురు గాలులకు చెట్లు, హోర్డింగులు కూలిపోతే తక్షణమే తొలగించి రవాణాకు ఆటంకాలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉన్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బలగాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ల ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, తక్షణమే స్పందించాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

స్థానిక ఎన్నికలపై పవన్ కీలక వ్యాఖ్యలు..

రెబల్స్‌కు స్పష్టమైన హెచ్చరిక జారీ

ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో దీనిని విజయవంతంగా పూర్తి చేశామని పవన్ తెలిపారు. అందరం కలిసి కూర్చుని చర్చించి అభ్యర్థుల జాబితాను ఖరారు చేశామన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పార్టీ కోసం త్యాగాలు చేసిన వారికి భవిష్యత్తులో తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రదర్శించిన ఐక్యతను మరోసారి స్థానిక ఎన్నికల్లోనూ చూపాలని నేతలకు పిలుపునిచ్చారు. సీట్ల సర్దుబాటు చర్చల సమయంలోనే ఆర్ణబ్ తుపాన్ వచ్చిందని, అంతటి క్లిష్ట పరిస్థితుల్లోనూ సీఎం చంద్రబాబు తుపాన్‌పై సమీక్షలు నిర్వహించి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారని పవన్ గుర్తుచేశారు. సంక్షోభ సమయంలో ఆయన పనితీరు అందరికీ ఆదర్శమన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడంలో ప్రభుత్వం ఛాలెంజింగ్‌గా పనిచేస్తోందని, దేశానికి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయని చెప్పారు. అడవితల్లి బాట కింద రూ.3,458 కోట్లతో 3,638 కిలోమీటర్ల రోడ్లు నిర్మించామని, పంచాయతీరాజ్ శాఖలో రూ.1.5 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు.

తెలంగాణకు పెట్టుబడులపై ఫోకస్..

గ్లోబల్ సమ్మిట్‌తో రేవంత్ సర్కార్ భారీ ప్లాన్!

సంస్థల ప్రతినిధులకు ఆహ్వానాలను అందించనున్నారు. ఇప్పటికే చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ రోడ్‌షోలు నిర్వహించిన విషయం తెలిసిందే. రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రక్షా ఎక్స్‌పోలో పాల్గొనేందుకు వందకు పైగా కంపెనీలు, సంస్థలకు ఆహ్వానాలను అందించనున్నారు. ఫ్యూచర్ సిటీలో 25 సెక్టార్లుగా ప్రధాన సమ్మిట్ వేదికను విభజించారు. ప్లీనరీలు, సెమినార్లు, చర్చలు, ఒప్పందాల కార్యక్రమాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అంతర్జాతీయ ప్రతినిధుల కోసం రవాణా, వసతి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ప్రతినిధికి సమన్వయ బాధ్యతల కోసం సీనియర్ అధికారిని నోడల్ అధికారిగా నియమించనున్నారు. ఈ ఏర్పాట్లన్నీ నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వ సీఎస్ సంజయ్ జాజు ఆదేశాలు జారీ చేశారు. యువతకు విస్తృత ఉపాధి అవకాశాల కల్పనే ఈ సమ్మిట్ ప్రధాన లక్ష్యమని సీఎస్ సంజయ్ జాజు పేర్కొన్నారు.

తెలంగాణలో 1.90 లక్షల మంది మహిళలకు కుట్టు మిషన్లు

కుట్టు మిషన్ల పంపిణీకి కార్యాచరణ చేపట్టాలని, కుట్టు మిషన్ల పథకానికి 4.80 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. 1.90 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. తెలంగాణలోని 327 గురుకులాల్లో 26 పాఠశాలలకే సొంత భవనాలు ఉన్నాయని, మిగిలిన 301 గురుకులాలకు సొంత భవనాల నిర్మాణంపై దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. గురుకులాలకు అవసరమైన స్థలాల సేకరణను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. బీసీ స్టడీ సర్కిళ్లలో సంస్కరణలు, ఉద్యోగాలే లక్ష్యంగా నాణ్యమైన శిక్షణ అందించాలన్నారు. బీసీలకు స్వయం ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. బీసీ వితంతువులు, ఒంటరి మహిళలకు నైపుణ్య శిక్షణపై ప్రత్యేక కమిటీని నియమించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఆధునిక ధోబీఘాట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ఆదేశాలు జారీ చేశారు.

ఎల్‌నినో ప్రభావంతో అన్ని ప్రాజెక్టులు ఎండిపోయే ప్రమాదం

అన్నదాతలకు చెబితే బాగుంటుందని పేర్కొన్నారు.(మంగళవారం) సంగారెడ్డిలో మంత్రులు పొంగులేటి, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి పర్యటించారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలోని జడ్పీ హాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, ఎంపీ రఘునందన్ రావు, ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. ధరణిని బంగాళాఖాతంలో వేసి భూ భారతిని తీసుకువచ్చామని వెల్లడించారు.

900 గ్రామాల్లో భూ సర్వే..

125 ఏళ్ల క్రితం పూర్తి భూ సర్వే జరిగితే... మళ్లీ ఇప్పుడు భూముల రీ సర్వే చేస్తున్నామని మంత్రి పొంగులేటి వివరించారు. 380 గ్రామాల్లో ఇప్పటివరకు పూర్తిగా భూ సర్వే పూర్తి అయిందని తెలిపారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో వారికి భూమి హక్కు పత్రాలు ఇచ్చామని స్పష్టం చేశారు. 900 గ్రామాల్లో భూ సర్వే చివరి దశకు వచ్చిందని ప్రస్తావించారు. ఏడాదిన్నరలోపు తెలంగాణలో ఈ భూ సర్వే పూర్తవుతుందని చెప్పుకొచ్చారు. వివాదరహితమైన భూములను రాబోయే తరానికి అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. ఆధార్ ఎలా ఉందో భూదార్ అలా ఉండబోతుందని చెప్పారు.

కేంద్రం నుంచి నిధులు రావడం ఆలస్యం..

గ్రామీణ ప్రాంతాల్లో కట్టుకునే ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావడం ఆలస్యమైందని మంత్రి పొంగులేటి అన్నారు. తాజాగా కేంద్రం 2 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. కేసీఆర్ హయాంలో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల బొమ్మలకు మాత్రమే పరిమితం అయ్యాయని విమర్శించారు. తమది ప్రజాప్రభుత్వమని.. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడికి రక్షణ ఉంటుందని వ్యాఖ్యానించారు. రేపు (బుధవారం) అఖిలపక్ష సమావేశం జరగుతుందని వెల్లడించారు. అఖిలపక్షంతో కలిసి కేంద్ర ప్రభుత్వ పెద్దలను త్వరలోనే కలుస్తామని తెలిపారు. తెలంగాణకు రావాల్సిన నిధులపై ప్రతిపక్షాలను తీసుకుని ఢిల్లీకి వెళ్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

కేటీఆర్, హరీశ్ రావు భ్రమల్లో ఉన్నారు



క్షేత్రస్థాయి వాస్తవాలను వారు గ్రహించడం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుచుకోవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మేధావి అని చెప్పుకునే కేసీఆర్ ఎలాంటి ఆలోచన లేకుండా అప్పులు చేశారని మహేశ్ గౌడ్ విమర్శించారు. ఎల్ నినో ప్రభావం దేశవ్యాప్తంగా ఉంటే, దాని గురించి హరీశ్ రావు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, 90,000 ఉద్యోగాలు పొందిన ప్రతి లబ్ధిదారుడు కాంగ్రెస్‌కే ఓటు వేస్తారని... క్షేత్రస్థాయిలో తమ పార్టీ బలంగా ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని... దేశంలో ఎక్కడా లేనంతగా తమ పార్టీలో సమన్వయం ఉందని మహేశ్ గౌడ్ తెలిపారు. నవంబర్‌లో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఆ తర్వాత తమ ప్రత్యక్ష లక్ష్యం ఎన్నికలేనని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని, ఆ పార్టీ పని అయిపోయిందని జోస్యం చెప్పారు. ప్రస్తుతం ఉన్న 8 ఎంపీ సీట్లలో రెండు కూడా గెలవడం కష్టమేనని.. మరోవైపు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలలో ఒక్కరు కూడా గెలవరని అన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 40 శాతం సీట్లు తమకే వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

పోలింగ్ రోజున పులివెందులలో ఉంటా.. భయపడొద్దు.. తిరగబడండి

మొదటి పేజి తరువాయి

అతిక్రమించి అన్యాయం చేసిన ఏ అధికారినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వారు సర్వీసులో ఉన్నా, ఒకవేళ రిటైర్ అయిపోయినా సరే.. ఎక్కడున్నా తీసుకొచ్చి చట్టం ముందు నిలబెట్టి చర్యలు తీసుకుంటాం. వడ్డీతో సహా చెల్లించేలా చేస్తాం" అని తీవ్రంగా హెచ్చరించారు. పులివెందులలో తమ కార్యకర్తలపై చేయి వేస్తే, తనపై చేయి వేసినట్లేనని ఆయన స్పష్టం చేశారు. "మన హక్కులు మనమే కాపాడుకోవాలి. తిరగబడండి" అని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో అధికార కూటమి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. "ఎన్నికల్లో 50 శాతం సీట్లలో పోటీ చేస్తున్నది మా అక్కచెల్లెమ్మలే. వారి నామినేషన్లను నడిరోడ్డుపై అడ్డుకుంటున్నారు. అక్కచెల్లెమ్మల చీరలు చించి దాడులు చేశారు. ఇలా చేయడానికి మీకు సిగ్గుందా? వైసీపీ హయాంలోనే మహిళలకు నిజమైన న్యాయం జరిగింది. ఇప్పుడు చంద్రబాబు చేస్తున్న పనులకు ఆయనే సిగ్గుతో తలదించుకోవాలి" అని మండిపడ్డారు. నామినేషన్ల ప్రక్రియలో అడుగడుగునా అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. "కూటమి నేతలే 17 మున్సిపాలిటీలు ఏకగ్రీవమని ప్రకటించుకున్నారు. నా సొంత నియోజకవర్గమైన పులివెందులలోనే కేవలం 20 వార్డుల్లో నామినేషన్లు వేయగలిగాం. 7 జడ్పీటీసీ స్థానాలకు గాను 4 చోట్ల మాత్రమే పోటీ జరుగుతోంది. స్ట్రూటినీ పేరిట 2 మండలాల్లో మా నామినేషన్లను అన్యాయంగా తిరస్కరించారు" అని దుయ్యబట్టారు. కార్యకర్తలంతా ధైర్యంగా ఉండాలని, వారికి తాను అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజున తాను స్వయంగా పులివెందులలోనే ఉంటానని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపు ఖాయమని అన్నారు. ఎవరూ



భయపడాల్సిన అవసరం లేదని... మీ అన్న మీకు తోడుగా ఉంటాడని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

తెలంగాణపై అర్ణబ్ తుపాను ప్రభావం - ఆ 4 ఉమ్మడి జిల్లాల్లో అతి భారీ వర్షాలు

మొదటి పేజి తరువాయి

సూర్యాపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వెల్లడించిన వాతావరణ శాఖ, గురువారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో కొన్నిచోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం 28వ తేదీ ఉదయం ఆంధ్రప్రదేశ్-యానాం ప్రాంతాల్లో తీరం దాటే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది. అనంతరం ఉత్తర దిశగా ఈ తుపాను ప్రయాణిస్తుందని నిపుణులు, శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

అర్ణబ్ తుఫాన్ ప్రభావంతో నేడు దక్షిణ మధ్య రైల్వే పలు రైళ్లను రద్దు చేసింది. రద్దు చేసిన 10 రైళ్ల వివరాలను తెలిపింది.

రద్దయిన రైళ్ల వివరాలు ఇవే

"బంగాళాఖాతంలో అతి తీవ్ర తుఫాన్ అర్ణబ్ కొనసాగుతుంది.



ప్రస్తుతం అదే ప్రాంతంలో గంటకు 20 కిలో మీటర్ల వేగంతో కదులుతుంది. పశ్చిమ వాయువ్య దిశగా కదులుతుంది. ప్రస్తుతం ఏపీలోని విశాఖపట్నంకి దక్షిణ ఆగ్నేయ దిశల్లో 220 కి.మీ., కాకినాడకి తూర్పు ఆగ్నేయ దిశల్లో 220 కి.మీ. దూరంలో కొనసాగుతుంది. ఈ అతి తీవ్ర తుఫాన్ అర్ణబ్ రేపు ఉదయం బాపట్ల విశాఖపట్నం మధ్య యానాం దగ్గర తీరందాటే అవకాశం ఉంది. తీవ్ర తుఫాన్ ప్రభావంతో రేపు తెలంగాణలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయి" - స్టెల్లా, హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాలకులు

తుపాను దిశ మారే అవకాశం

ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ తుపాను యానాంకు సమీపంలో తీరం దాటే అవకాశం ఉండగా దట్టమైన మేఘాల వల్ల దిశ మారే అవకాశం కూడా ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఒక వేళా దిశ మారితే నెల్లూరు-మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఇది అత్యంత తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని మరి కొన్ని వాతావరణ సమూనాలు వెల్లడించాయి. అర్ణబ్ తుపాను తీరం దాటనుండడంతో భారీ గాలుల ముప్పుతో పాటు తీర ప్రాంతాల్లో 20 సెంటీ మీటర్లకుపైగా కుండపోత వర్షం పడే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఎల్ నినో విలయతాండవంతో అన్ని రిజర్వాయర్లలో నీటి మట్టాలు డెడ్ స్టోరేజీకి చేరుతున్నాయి. ఈ సమయానికి 400కు పైగా టీఎంసీలు ఉండాల్సిన పరిస్థితుల్లో కేవలం 200 టీఎంసీలే ఉన్నాయని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే ప్రకటించారు. ఈ తుపానుతో ప్రయోజనం ఉంటుందా? అని రైతాంగం ఎదురుచూస్తోంది.

ఎన్నికల్లో నెతన్యాహు ఓడితే యుద్ధం ఆగుతుందా?

మొదటి పేజి తరువాయి

అయితే, అమెరికా, ఇరాన్ మధ్య ఆంక్షలు, చమురు ఎగుమతులు, హార్మూజ్ జలసంధి అంశాలపై ప్రతిష్టంభన కొనసాగుతున్నప్పటికీ, పెద్దస్థాయి పోరాటం కొన్ని నెలలుగా నిలిచిపోయింది. ఎన్నికల్లో నెతన్యాహు ఓడితే తక్షణ సైనిక దాడులకు ఇజ్రాయెల్ ప్రభుత్వం చేసే ప్రయత్నాలు తగ్గవచ్చని అంచనా. అయితే, అమెరికా-ఇరాన్ మధ్య మరో యుద్ధం జరిగే ప్రమాదం పూర్తిగా తొలగిపోదు.

ఐసెన్‌కోట్ అధికారంలోకి వస్తే ఏం మారవచ్చు?

నెతన్యాహుకు ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న గాది ఐసెన్‌కోట్ గతంలో ఇజ్రాయెల్ సైన్యాధిపతిగా పనిచేశారు. జాతీయ భద్రత విషయంలో మరింత బాధ్యతాయుతమైన ప్రత్యామ్నాయంగా తనను తాను ఆయన పరిచయం చేసుకున్నారు. ట్రంప్‌ను ఇజ్రాయెల్‌కు మిత్రుడిగా అభివర్ణిస్తూ, తాను ఎన్నికైతే ఆయనతో కలిసి పనిచేస్తానని చెప్పారు. నెతన్యాహు విధానాలపై ఐసెన్‌కోట్ విమర్శలు ప్రధానంగా ఆయన వ్యవహారశైలి, ఎన్నికల ప్రయోజనాల కోసం ఇరాన్ ముప్పును ఉపయోగించుకున్నారనే ఆరోపణలపై కేంద్రీకృతమయ్యాయి. ఇరాన్ విషయంలో ఇజ్రాయెల్ భద్రతా లక్ష్యాలను వదులుకుంటానని ఆయన హామీ ఇవ్వలేదు. అందువల్ల, ఐసెన్‌కోట్ ప్రభుత్వం ఏర్పడినా ఇరాన్ సైనిక సామర్థ్యాలపై ఒత్తిడి, అణు కార్యక్రమానికి వ్యతిరేకత కొనసాగవచ్చు. మార్పు ప్రధానంగా సైనిక చర్యలను ఎప్పుడు, ఎలా చేపట్టాలనే అంశాల్లో ఉండవచ్చు.

ట్రంప్ నిర్ణయాలే కీలకం

ఇరాన్‌పై పూర్తిస్థాయి యుద్ధాన్ని మళ్లీ ప్రారంభించాలా? లేక సైనిక ఒత్తిడిని ఉపయోగించి ఆ దేశం నుంచి రాయితీలు పొందాలా? అన్నది ట్రంప్ ముందున్న ప్రధాన ప్రశ్న. అమెరికా సైన్యం ఆదేశాలు అందిన 96 గంటల్లో ఇరాన్‌పై భారీ సైనిక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉందని వార్తలు వెలువడ్డాయి. ఆ చర్యలు రాడార్ వ్యవస్థలు, క్షిపణి ప్రయోగ కేంద్రాలపై పరిమిత దాడులకే కాకుండా విస్తృత స్థాయి దాడులకు కూడా దారితీయవచ్చని సమాచారం. అయితే, అమెరికాలో ఇరాన్ యుద్ధానికి ప్రజాదరణ తగ్గడం, ఇంధన ధరలు పెరగడం ట్రంప్‌కు రాజకీయపరమైన సవాళ్లుగా మారాయి. నవంబర్ 3న జరిగే అమెరికా మధ్యంతర ఎన్నికలకు ముందు ఇరాన్‌పై దాడి చేయబోమని ఆయన ప్రకటించారు. ఇజ్రాయెల్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడితే దౌత్య చర్చలకు ఆయనకు మరింత అవకాశం లభించవచ్చు. అయినప్పటికీ, యుద్ధం ద్వారా స్పష్టమైన ఫలితాలు సాధించాలనే ఒత్తిడి కొనసాగుతుంది.

దౌత్య చర్చలకు అవకాశాలు

ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించేందుకు సౌదీ అరేబియా, టర్కీ, పాకిస్థాన్‌కు చెందిన సీనియర్ అధికారులు టెహ్రాన్‌లో ఇరాన్ ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారు. ఈ దేశాలు మక్కా ఒప్పందంలో భాగస్వాములుగా ఉన్నాయి. ఖతార్ కూడా మధ్యవర్తిత్వంలో పాల్గొంటోంది. అమెరికా-ఇరాన్ చర్చలు, హార్మూజ్ జలసంధి, ఇరాన్ నౌకాశ్రయాలపై అమెరికా నౌకాదళ దిగ్బంధం ప్రధాన చర్చాంశాలుగా ఉన్నాయి. దిగ్బంధం కొనసాగుతూ, చమురు ఎగుమతులపై ఆంక్షలు అమల్లో ఉన్నంతకాలం అమెరికా షరతుల ప్రకారం చర్చలకు తిరిగి రాబోమని ఇరాన్ తెలిపింది. అయితే, మధ్యవర్తుల సహకారంతో తాత్కాలిక ఒప్పందం కుదిరితే చర్చలను పునఃప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలిచ్చింది. అమెరికా నౌకాదళ దిగ్బంధాన్ని ఎత్తివేస్తే హార్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు కూడా ప్రతిపాదించింది. చర్చలు తిరిగి ప్రారంభించే షరతులపై ఇరు దేశాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఇరాన్ అణు కార్యక్రమం మాత్రం కీలక అడ్డంకిగానే ఉంది.

ప్రభుత్వ కూటమి, చమురు మార్కెట్లపై ప్రభావం

ఇజ్రాయెల్ పార్లమెంటు నెస్సెట్‌లో మొత్తం 120 స్థానాలున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు 61 స్థానాలు అవసరం. నెతన్యాహు కూటమికి గానీ, ప్రతిపక్షానికి గానీ మెజారిటీ భాయంగా లేదు. ఆయన పార్టీ లికుడ్ ఓడిపోయినా, భాగస్వామ్య పార్టీలతో చర్చలు జరిపి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు వారాలు లేదా నెలలు పట్టవచ్చు. కొత్త ప్రభుత్వ వైఖరి కూడా కూటమిలో చేరే పార్టీలపై ఆధారపడి ఉంటుంది. ఇదిలా ఉండగా, గత కొన్ని వారాల్లో సౌదీ లక్ష్యాలపై హౌతీ దాడులు పెరగడంతో చమురు మౌలిక సదుపాయాలు, నౌకాయాన మార్గాల భద్రతపై ఆందోళనలు పెరిగాయి. ప్రపంచ ఇంధన సరఫరాకు కీలకమైన హార్మూజ్ జలసంధితో పాటు, బాబ్ అల్-మండెబ్ జలసంధి కూడా ప్రాంతీయ వాణిజ్యానికి ప్రమాదకరంగా మారవచ్చు. ఇజ్రాయెల్ దాడుల ముప్పు తగ్గితే మార్కెట్లలో సానుకూలత పెరిగి, దౌత్య ప్రయత్నాలకు ఊతం లభించవచ్చు. మొత్తంగా, నెతన్యాహు ఓటమి యుద్ధం తీవ్రత పెరిగే ప్రమాదాన్ని తగ్గించవచ్చే తప్ప, శాశ్వత శాంతికి హామీ ఇవ్వదు. ట్రంప్ రాజీకి సిద్ధపడతారా, ఇరాన్ ఎలా స్పందిస్తుంది, ఇజ్రాయెల్‌లో కొత్త ప్రభుత్వం ఎంత స్థిరంగా ఉంటుంది అనే అంశాలే ప్రాంతీయ భద్రత, చమురు మార్కెట్ల భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

జర్నలిజానికి డేటా చట్టం ముప్పు.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన మీడియా సంస్థలు

మొదటి పేజి తరువాయి

జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. కేంద్ర ప్రభుత్వ వాదన వినకుండా చట్టంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. పౌరుల హక్కులు, మీడియా హక్కుల మధ్య సమతుల్యత సాధించాల్సిన అవసరం ఉందని సీజేఐ సూర్యకాంత్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తదుపరి విచారణను నవంబర్ 17కు వాయిదా వేస్తూ, ఈ అంశంపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ఇతర పిటిషన్లతో కలిపి విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

జర్నలిజానికి ముప్పు తప్పదు: పిటిషనర్ల వాదన

ఇఫ్రూ తరపున సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ వాదనలు వినిపిస్తూ, ఈ చట్టం "ముందస్తు సెన్సార్‌షిప్" విధించేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. "ఒక వార్తా కథనం రాయాలంటే, అందులోని వ్యక్తుల అనుమతి కోసం ఎదురుచూడాల్సి వస్తే, ఇక వార్త అనే భావనకే అర్థం ఉండదు. ఈ చట్టం వల్ల న్యూస్ రూమ్‌లు మూతపడతాయి" అని ఆమె కోర్టుకు వివరించారు. గతంలో తీసుకొచ్చిన డేటా పరిరక్షణ చట్టాల ముసాయిదాలలో జర్నలిజానికి మినహాయింపులు ఉండేవని, కానీ తుది చట్టంలో వాటిని



తొలగించారని ఆమె గుర్తు చేశారు. చట్టంలోని సెక్షన్ 7, 17(2), 18, 19, 27, 29, 36, 37, 44(3)లతో పాటు, ఇఫ్రూ రూల్స్, 2025లోని 16, 17, 23 నిబంధనలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19(1)(ఘ)లకు విరుద్ధంగా ఉన్నాయని, వాటిని రద్దు చేయాలని పిటిషనర్లు కోరారు. ఈ నిబంధనల ప్రకారం, ప్రచురితమైన కథనాలపై వ్యక్తులు అభ్యంతరం తెలిపితే, వారి డేటాను తొలగించాల్సి వస్తుంది. ఇది చారిత్రక రికార్డులను సైతం మార్చే ప్రమాదం ఉందని వారు వాదించారు. అలాగే, సెక్షన్ 36 ప్రకారం, ప్రభుత్వం ఎలాంటి జ్యుడీషియల్ పర్యవేక్షణ లేకుండా మీడియా సంస్థల నుంచి సమాచారం కోరవచ్చని, ఇది రహస్య సోర్సుల గోప్యతకు భంగం కలిగిస్తుందని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.250 కోట్ల వరకు జరిమానా విధించడం చిన్న, ప్రాంతీయ మీడియా సంస్థల మనుగడను ప్రశ్నార్థకం చేస్తుందని తెలిపారు.

ఆర్‌టీఐ చట్టం నిర్వీర్యం

ఇదే చట్టంలోని సెక్షన్ 44(3) ద్వారా సమాచార హక్కు చట్టం, 2005లోని సెక్షన్ 8(1)(ఐ)ని సవరించడాన్ని కూడా పిటిషనర్లు సవాల్ చేశారు. ఈ సవరణ వల్ల, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కూడా వ్యక్తిగత సమాచారాన్ని పొందడం కష్టతరం అవుతుందని, ఇది పారదర్శకతకు గొడ్డలిపెట్టు అని వాదించారు. 2023లో ఆమోదం పొందిన ఈ చట్టానికి సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం 2025లో నోటిఫై చేసింది. 2027 మే నుంచి పూర్తిస్థాయిలో అమలులోకి రానుంది. జర్నలిజానికి మినహాయింపులు కోరుతూ ఇఫ్రూ ఇప్పటికే కేంద్ర సమాచార, ప్రసార, ఐటీ మంత్రిత్వ శాఖలతో చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈయూ, యూకే, సింగపూర్ వంటి దేశాల్లోని డేటా చట్టాల్లో జర్నలిజానికి స్పష్టమైన మినహాయింపులు ఉన్నాయని పిటిషనర్లు గుర్తుచేశారు. కేంద్రం ఇచ్చే సమాధానం తర్వాత ఈ కేసు విచారణ కీలక దశకు చేరుకోనుంది.

మొదలైన తుపాను ప్రభావం.. విశాఖలో విరిగిపడుతున్న చెట్లు, ఉత్తరాంధ్రలో హై అలర్ట్

మొదటి పేజి తరువాయి



రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు విశాఖలోని ఆర్‌కే బీచ్, రుషికొండ బీచ్‌లను పూర్తిగా మూసివేశారు. పర్యాటకులు, స్థానికులు సముద్ర తీరానికి రావద్దని తీవ్రంగా హెచ్చరించారు. తుపాను ప్రభావం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోనూ అధికంగా ఉంది. శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం, గార, లావేరు, ఆమదాలవలస, పొందూరు సహా 12 మండలాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దాదాపు 4.65 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి పంట కోతకు సిద్ధంగా ఉండగా, ఈదురుగాలులకు పంట నేలవాలుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి వరి కోతలు చేపట్టవద్దని వ్యవసాయ అధికారులు సూచించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కంట్రోల్ రూమ్‌ల ద్వారా పరిస్థితిని సమీక్షిస్తూ, జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. విజయనగరం జిల్లాలోనూ పలుచోట్ల ఈదురుగాలులతో వర్షాలు పడుతుండటంతో, కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి ల

ప్రజా న్యూస్ నెట్‌వర్క్
నిజం.. సమాజం.. ప్రజా కోసం.. తెలుగు దినపత్రిక

ప్రజా కవి సుద్దాల హనుమంతు విగ్రహాన్ని ట్యాంక్ బండి పై పెట్టాలి

- తెలంగాణ జానపద అకాడమీకి ప్రజా కవి సుద్దాల హనుమంతు పేరు పెట్టాలి సుద్దాల జానకమ్మ హనుమంతు జాతీయ పురస్కారాల సభలో కాంగ్రెస్ నాయకులు రాష్ట్రీయ ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్ సీఎంకు విజ్ఞప్తి

కుత్బుల్లాపూర్. అక్టోబర్.27 ప్రజా న్యూస్ నెట్వర్క్ ..

ప్రజాకవి సుద్దాల జానకమ్మ హనుమంతు జాతీయ పురస్కారాల సభ రవీంద్రభారతిలో ఘనంగా సుద్దాల ఫౌండేషన్ చైర్మన్ గేయ రచయిత రాష్ట్రపతి అవార్డు గ్రహీత అశోక తేజ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో సుద్దాల జానకమ్మ హనుమంతు జాతీయ అవార్డు ను సన్మానం అందుకున్న మాజీ కౌన్సిలర్ గూడవరమ్మ ఐలయ్య దంపతులు రోడ మేస్త్రి నగర్ డివిజన్ మగ్గం నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఓబిసి రాష్ట్రీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ నాడు నైజాం నిరంకుశత్వ పాలనకు వ్యతిరేకంగా మట్టి మనుషులకు పాటలే తూటాలై సాయిధ ఉద్యమానికి తిరుగుబాటు నేర్పిన వీరుడు ప్రజా కవి సుద్దాల హనుమంతు అన్నారు నాడు నైజాం పాలన పోయి ప్రజల ప్రజా పాలన రావాలని హనుమంతు పిలుపునిచ్చారు నేడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి నేటి దొరల పాలను తరిమికొట్టి తెలంగాణలో ప్రజా పాలన ఏర్పాటు చేశారు ఈ ప్రజా పాలనలో మన సంస్కృతి కాపాడుట కోసం కవులను కళాకారులను జానపద కళాకారులను ప్రోత్సహిస్తూ మన తెలంగాణ సంస్కృతి కాపాడుతున్నారని అన్నారు ఈ ప్రజా పాలనలో నాటి కలలుగన్న ప్రజా కవి సుద్దాల హనుమంతు విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై పెట్టాలని వారి పేరు మీద తెలంగాణ జానపద అకాడమీనీ సుద్దాల హనుమంతు పేరు మీద ఏర్పాటు చేయాలని కోరారు దీనికి శాసనసభ్యులు అద్దంకి దయాకర్ అన్న ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు సుద్దాల హనుమంతు స్ఫూర్తితో సుద్దాల తెలంగాన సాయుధ పోరాట యోధులు గూడ పుల్లయ్య గౌడ్ రామస్వామి బత్తిని లక్ష్మీనరసు లక్ష్మీ నరసింహారెడ్డి వారసత్వంగా 40 సంవత్సరాలు ఎర్రజెండా నీడలో నిరుపేదల కోసం రైతుల కోసం విద్యార్థుల కోసం యువకుల కోసం కార్మికుల కోసం నిరంతరం పోరాడి జైలుకెళ్లి జీవన కొనసాగించిన నాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంకా పేదలకు ఎక్కువ సేవ చేయాలంటే కాంగ్రెస్లో కలిసి పని చేయాలని అవకాశం కల్పించారు నాకు అనగా గూడ ఐలయ్య గౌడ్ కి అవార్డు అవకాశం కల్పించిన సుద్దాల ఫౌండేషన్ చైర్మన్ అశోక్ తేజ సుధాకర్ తేజ కి ధన్యవాదాలు తెలియజేశారు సందర్భంగా జాతీయ దళిత సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు బూదాల అమర్ బాబు సుద్దాల ఫౌండేషన్ చైర్మన్ సినీ గే రచయిత సుద్దాల అశోక్ తేజను గజమాలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వరమ్మ దళిత సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్యక్షులు ఆనంద్ బాబు రేవంత్ రెడ్డి యువసేన గూడ సాయి ప్రవీణ్ గౌడ్ అడ్వకేట్ రోహిత్ గౌడ్ సాయి పూజ గౌడ్ యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు సత్యనారాయణ గౌడ్ కాంగ్రెస్ పార్టీ జనగాం డిసిసి ప్రధాన కార్యదర్శి జెకె కృష్ణ గారు ప్రగతి శ్రీనివాస్ ప్రవీణ సందీప్ ప్రసన్న భరత్ మాజీ సైనికుడు గడ్డమీద కళావతి యాదమ్మ బాస్ పెళ్లి బాలకృష్ణ బత్తిని ఐలయ్య నరసమ్మ సులోచన మంగ పాల్గొన్నారు



ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన సదస్సు

- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఆదేశాల మేరకు కార్యక్రమం

కుత్బుల్లాపూర్. అక్టోబర్ . ప్రజా న్యూస్ నెట్వర్క్ ...

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు, ఓటు హక్కుపై అవగాహన సదస్సును నిర్వహించారు. సీనియర్ నాయకులు చామల లావ కుమార్ మరియు రాచకొండ మల్లేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది..వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి తెలంగాణ రక్షణ సేన అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ నాళ్ల మాస్ శ్రీకాంత్ గౌడ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు..పట్టభద్రులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, నమోదు ప్రాముఖ్యతను వివరించారు...ప్రజాస్వామ్యంలో పట్టభద్రుల ఓటు కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదుపై బాధ్యతతో వ్యవహరించాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని పట్టభద్రులకు అవగాహన కల్పించారు.






బాలల హక్కులు, భద్రతపై న్యాయ అవగాహన కార్యక్రమాలు

(సంగారెడ్డి మండలం) అక్టోబర్ 27: ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

సురక్షిత్ బచ్పన్ అభియాన్‌లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (ఐూూూ), సంగారెడ్డి ఆధ్వర్యంలో యెద్దుమైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ప్రాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేంద్రీయ విద్యాలయంలో న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐూూూ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య విద్యార్థులకు బాలల హక్కులు, భద్రత, మంచి స్పర్శచెడు స్పర్శ, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, POCSO చట్టం2012, బాధితులకు అందుబాటులో ఉన్న న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు. ప్రమాదకర పరిస్థితులు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. అనంతరం బాలల హక్కులను గౌరవిస్తూ, ప్రతి చిన్నారి భద్రత కోసం కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అనంతసాగరం మండలం జడ్.పి.టి.సి టిడిపి అభ్యర్థిగా మెట్టుకూరు శిరీష

అనంతసాగరం అక్టోబర్ 27 ప్రజాన్యూస్ నెట్ వర్క్, రిపోర్టర్. యు. ప్రవీణ్ కుమార్ :



మెట్టుకూరు శిరీష కు బీఫారం అందజేసిన రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు లిశ్రీ ఆనం రామనారాయణ రెడ్డి గారు .మరియు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు.

అనంతసాగరం మండల జడ్పిటిసి కూటమి తరుపున టిడిపి అభ్యర్థిగా మెట్టుకూరు శిరీష గారు టిడిపి అధిష్టానం నిర్ణయించింది. నెల్లూరు లోని టిడిపి కార్యాలయంలో గౌరవ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు లిశ్రీ ఆనం రామనారాయణ రెడ్డి గారు టిడిపి బీఫారం ను మెట్టుకూరు శిరీష కు అందజేశారు. ఈ సందర్భంగా గౌరవ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి గారి గారికి కృతజ్ఞతలు తెలియజేసిన జడ్.పి.టి.సి టిడిపి అభ్యర్థి మెట్టుకూరు శిరీష గారు

బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ



మిర్యాలగూడ అక్టోబర్ 26 (ప్రజా న్యూస్ నెట్వర్క్ పి వెంకటయ్య)

మిర్యాలగూడ పట్టణంలో బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు లిడీఎస్పీ తో కలిసి మిర్యాలగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ లి పరామర్శించారు.గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దేశిడి శేఖర్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ బోర్ల నుంచి పరిశ్రమలకు నీటి తరలింపుపై సమగ్ర విచారణ జరపాలి : ఎమ్మెల్యే చింత ప్రభాకర్

తాగునీటి కొరత వేళ బీర్ పరిశ్రమలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాపై ఆగ్రహం

రైతులకు భూసేకరణ పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి

(సంగారెడ్డి మండలం) అక్టోబర్ 27 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న సమయంలో వ్యవసాయ బోర్ల నుంచి ట్యాంకర్ల ద్వారా పరిశ్రమలకు నీటిని తరలిస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులను కోరారు. సంగారెడ్డిలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన నీటి సరఫరా, వ్యవసాయ బోర్ల నీటి వినియోగం, భూసేకరణ పరిహారం అంశాలను ప్రస్తావించారు.వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను వినియోగించుకుంటూ బోర్ల నుంచి నీటిని తోడి పరిశ్రమలకు తరలిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని సూచించారు. వ్యవసాయ బోర్ల నీటిని ఇతర అవసరాలకు మళ్లిస్తే భూగర్భ జలమట్టాలు పడిపోయి భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి వనరుల దుర్వినియోగాన్ని అరికట్టి ప్రజలకు ప్రాధాన్యతనిస్తూ తాగునీరు అందించాలని స్పష్టం చేశారు.ఎల్‌నినో ప్రభావంతో రానున్న కాలంలో నీటి వనరులపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే సూచించారు. సంగారెడ్డి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించాలని, అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. అధికారులు నిరంతరం నీటి వినియోగాన్ని పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

రైతులకు భూసేకరణ పరిహారం అందించాలి

మునిదేవునిపల్లి ప్రాంతంలో పరిశ్రమల కోసం భూసేకరణ చేసినప్పటికీ కొందరు రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందలేదని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను బెదిరించి తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలపైనా విచారణ జరపాలని కోరారు. భూసేకరణ రికార్డులను సమగ్రంగా పరిశీలించి, పరిహారం అందని రైతులను గుర్తించి వారికి న్యాయం చేయాలని అధికారులకు సూచించారు.భూసేకరణ, పరిహారం పంపిణీ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చూడాలని కోరారు.ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని చింత ప్రభాకర్ పేర్కొన్నారు. నీటి కొరత నివారణకు సమర్థవంతమైన కార్యాచరణ అమలు చేయడంతో పాటు, నీటి వనరుల అక్రమ వినియోగాన్ని అరికట్టి ప్రజలకు సకాలంలో తాగునీరు అందించాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు.



సింగూరు జలాశయంలో అడుగంటిన నీరు డిసెంబర్ నాటికి తాగునీటి సంక్షోభం తప్పదా?



ప్రజా న్యూస్ అక్టోబర్ 27 అందోల్ ప్రతినిధి (మహమ్మద్ అభేద్)

వర్షాభావ పరిస్థితులతో సింగూరు ప్రాజెక్టులో నీటి నిల్వలు వేగంగా తగ్గిపోతున్నాయి. ఒకప్పుడు నిండుకుండలా కళకళలాడిన జలాశయం ఇప్పుడు నేల పగుళ్లతో కనిపిస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం సుమారు 3 టీఎంసీల నీరు మాత్రమే మిగిలి ఉందని, ఇది అధికారులు, ప్రజల్లో ఆందోళన కలిగిస్తోందని తెలుస్తోంది.ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గడం, భూగర్భ జలమట్టాలు పడిపోవడం, మంజీరా డ్యామ్ ఎండిపోవడం వంటి కారణాలతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. నీటి నిల్వలు ఇలాగే తగ్గితే డిసెంబర్ నాటికి తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.సింగూరు జలాలు హైదరాబాద్ మహానగరంతో పాటు ఉమ్మడి మెదక్, కామారెడ్డి జిల్లాల తాగునీటి అవసరాలకు ప్రధాన ఆధారం. ఈ నేపథ్యంలో నీటి వినియోగంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై కసరత్తు చేస్తున్నారు.ఒకప్పుడు రైతుల పొలాలకు పచ్చదనాన్ని, పల్లెలు, పట్టణాల దాహార్తిని తీర్చిన మంజీరా నది ఇప్పుడు నెర్రెలు బారింది. వర్షాలు కురవకపోతే రానున్న రోజుల్లో గుక్కెడు నీటి కోసం ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

వైట్ ప్లేట్ వాహనాలతో టాక్సీ డ్రైవర్లకు నష్టం : జీఎంఆర్ టాక్సీ అసోసియేషన్



(సంగారెడ్డి మండలం) అక్టోబర్ 27 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

బ్లా బ్లా యాప్ ద్వారా వైట్ ప్లేట్ ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణికులను తరలించడాన్ని నియంత్రించాలని జీఎంఆర్ టాక్సీ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి పన్నులు, ఇతర రుసుములు చెల్లిస్తూ టాక్సీ సేవలు అందిస్తున్న తమకు, ప్రైవేట్ వాహనాల తక్కువ ధరల ప్రయాణ సేవల వల్ల బుకింగ్‌లు తగ్గి ఆదాయం పడిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ రవాణా శాఖ మంత్రి స్పందించి, నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య ప్రయాణికుల రవాణా జరుగుతోందన్న ఆరోపణలపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆటో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ దస్తగిరి, లింగంపల్లి టాక్సీ యూనియన్ అధ్యక్షుడు తాజుద్దీన్, ఉపాధ్యక్షుడు జి. అశోక్, అడ్వైజర్ శ్రీనివాస్, బేతయ్య, ఫయాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు పోతుల జ్ఞానయ్యకు ఘన సన్మానం

జ్ఞానయ్య నివాసంలో సత్కారం..

అభినందనలు తెలిపిన వివిధ పార్టీల నాయకులు



హుజూర్‌నగర్ మండలం, అక్టోబర్ 27, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి:

సూర్యాపేట జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నియమితులైన హుజూర్‌నగర్‌కు చెందిన పోతుల జ్ఞానయ్యను మంగళవారం ఆయన నివాసంలో వివిధ పార్టీల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ పార్టీ నాయకుడు సుతారి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకుడు వెంకట్‌రెడ్డి, మహిళలు,తదితరులు పాల్గొని జ్ఞానయ్యకు అభినందనలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శించిన లిమున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ



మిర్యాలగూడ అక్టోబర్ 27(ప్రజా న్యూస్ నెట్వర్క్ పి వెంకటయ్య)

మిర్యాలగూడ పట్టణంలో బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు లిడీఎస్పీ తో కలిసి మిర్యాలగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ లి పరామర్శించారు.గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దేశిడి శేఖర్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అదనపు ట్రైన్ కలెక్టర్ రోహిత్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రైతు రక్షణ సమితి అధ్యక్షుడు ఇంగె భాస్కర్



ఎల్కతుర్తి అక్టోబర్ 27 ప్రజా న్యూస్ నెట్వర్క్, రిపోర్టర్ బొంకూరి కార్తీక్:

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో మంగళవారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయంలో అదనపు ట్రైన్ కలెక్టర్, ఇన్‌చార్జి తహసీల్దార్ రోహిత్‌ను ఉమ్మడి కరీంనగర్‌హనుమకొండ జిల్లాల రైతు రక్షణ సమితి అధ్యక్షుడు ఇంగెభాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు

ఈ సందర్భంగా రోహిత్‌కు శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇంగె భాస్కర్ మాట్లాడుతూ, రోహిత్ ఇన్‌చార్జి బాధ్యతల్లో ఉన్నంతకాలం మండలంలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. రైతుల సమస్యలను సకాలంలో పరిష్కరిస్తూ, వారికి ప్రభుత్వ పరంగా అందాల్సిన సేవలు సజావుగా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు దానికి స్పందించిన అదనపు ట్రైన్ కలెక్టర్ ఇన్చార్జి తహశీల్దార్ రోహిత్ ఈ కార్యక్రమంలో అంబరి శ్రీనివాస్, కోదాటి మాధవరావు, జీలుగుల మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొంటున్నారు

టి వై జె ఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఝాన్సీ నియామకం



(సంగారెడ్డి మండలం) అక్టోబర్ 27 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టి వై జె ఎఫ్) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఝాన్సీ నియమితులయ్యారు.టి వై జె ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు లిడా. తనుగుల జితేందర్ రావులి ఆదేశాల మేరకు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లిషేక్ మెహబూబ్‌లి ఆధ్వర్యంలో ఝాన్సీను రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, యువ జర్నలిస్టుల సంక్షేమం కోసం టి వై జె ఎఫ్ మరింత బలోపేతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఫెడరేషన్ అభివృద్ధికి కృషి చేయాలని ఝాన్సీను అభినందించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజనల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కోన వేణు రాష్ట్ర సెక్రటరీ జగత్ కృష్ణలిటి వై జె ఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సంతోష్ కుమార్ గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ భాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించాలి



త్రిపురారం మండలం అక్టోబర్ 27 ప్రజా న్యూస్ నెట్వర్క్ రిపోర్టర్ గాసిరాం

నాగార్జున సాగర్ శాసనసభ్యులు గౌ : శ్రీ కుందూరు జై వీర్ రెడ్డి గారి ఆదేశానుసారం, నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఓటర్ నమోదు అవగాహనా,కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల శాసన మండలి అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారిని గెలిపించుటకు ఈ రోజు 27-10-2026 న రాగడప, లచ్య తండ, పలుగుతండ, కుంకుడు చెట్టు తండ గ్రామాల లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అలంపల్లి జానయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమం లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ధనవత్ భాస్కర్ నాయక్, మాజీ మండల అధ్యక్షులు ముడిమల్ల బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ సలహాదారుడు అనుముల శ్రీనివాస్ రెడ్డి,మాజీ మార్కెట్ చైర్మన్ చంద్రారెడ్డి,మాజీ పిఎసిస్ చైర్మన్ అనుముల అనంత రెడ్డి, మాజీ యూత్ అధ్యక్షులు కసిరెడ్డి నరేష్,మాజీ ఎంపీటీసీ అనిల్, ఆవిరండ్ల వీరయ్య, డ్రిప్ వెంకట్ రెడ్డి,బంక్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్.కె నజిమ్, బొల్లం వెంకటేశ్వర్లు, పెద్దలు, కృష్ణయ్య, మోహిజ్, సర్పంచ్ లు రమేష్, నాగ్ నాయక్, కిషన్, మగ్త, శంకర్, చంటి, సర్దార్,కేసు, హత్తిరామ్, సేవా, నర్య, అభి, హరి, మోహన్, నాగ, రవి, మరియు పట్టభద్రులు, కార్యకర్తలు, అధిక సంఖ్య లో పాల్గొని రాబోయే పట్టభద్రుల ఎలక్షన్స్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారిని అత్యధిక మెజార్టీ తో గెలిపిస్తామని తెలియచేసినారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు అజరామరం..

వారి సేవలు చిరస్మరణీయం!

హుజూర్‌నగర్‌లో పోలీసుల బైక్ ర్యాలీ.. అమరవీరులకు ఘన నివాళి



హుజూర్‌నగర్ మండలం, అక్టోబర్ 27, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :

సూర్యాపేట జిల్లా పరిధిలోని హుజూర్‌నగర్ పట్టణంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మంగళవారం పట్టణ ఎస్ఐ చలికంటి నరేష్, హుజూర్‌నగర్ రూరల్ ఎస్ఐ హనుమాన్ నాయక్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి ఇందిరా చౌక్ వరకు సాగిన ఈ ర్యాలీలో పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తూ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసుల సేవలను గుర్తుచేసుకుంటూ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్ఐలు మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ అజరామరమని, ప్రజల భద్రత కోసం వారు చేసిన సేవలు సమాజానికి నిరంతర స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ప్రజలకు రక్షణ కల్పించడం, చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం, శాంతిభద్రతలను కాపాడటం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి స్పందిస్తూ సేవలందించడమే వారికి అందించే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు వారి త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, ప్రజా రక్షణలో పోలీసుల బాధ్యతను గుర్తుచేసే కార్యక్రమాలని పేర్కొన్నారు. ఈ బైక్ ర్యాలీలో హుజూర్‌నగర్ పట్టణ, రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొని అమరవీరుల పట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు.

ఆఫీసర్స్ కాలనీ, ఈసీ నగర్, రామకృష్ణ నగర్‌లో కోటి రూపాయల నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

- 900 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



హైదరాబాద్ ఉప్పల్ ప్రతినిధి కె శివ కుమార్ అక్టోబర్ 27 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్):

చెర్లపల్లి డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీ, ఈసీ నగర్, రామకృష్ణ నగర్ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో కోటి రూపాయల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కాలనీల్లో రహదారుల అభివృద్ధి ద్వారా స్థానిక ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని, చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ప్రజల అవసరాలను గుర్తించి, స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నగర్ డంపు యార్డు తొలగించాలని డిమాండ్

ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్ర

మహిళలు హారతులు పట్టి స్వాగతం





హైదరాబాద్ ఉప్పల్ ప్రతినిధి కె శివ కుమార్ అక్టోబర్ 27 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్):

ఈటల మాట్లాడుతూ నీళ్లు తాగలేక పోతున్నాము.నీళ్లు ముట్టుకుంటే చేతులకు పుండ్లు అవుతున్నాయి. చెరువులో చేపలు చచ్చిపోయాయి, నీళ్లు తాగితే గొర్లు చచ్చిపోతున్నాయి. ఈరోజు ఆ ఊర్లో సుశీలమ్మ అనే మహిళ క్యాన్సర్ తో చనిపోయింది. జవహ నగర్ డంపు విషపు నీళ్లు మా చెరువులో పడి మా బ్రతుకు ఆగమైందని ఆ ఊరు వారంతా వాపోతున్నారు. లక్షల మంది డంప్ యార్డు చుట్టుపక్కల ఉన్నవారు ప్రాణాలు అరచేతిలో పట్టుకొని వెళ్లదీస్తున్నారు. వీరి బాధలు తెలుసుకొని జవహర్ నగర్ డంప్ యార్డు తొలగించాలని మీకోసం నాలుగు రోజులపాటు 60 కిలోమీటర్ల పాదయాత్ర చేస్తున్నాను. మీ సమస్యలు తీర్చడం ఎంపీగా నా బాధ్యత. వరంగల్ నేషనల్ హైవే అయిన తర్వాత ఆక్సిడెంట్స్ జరిగి ప్రజలు పిట్టల్లా చనిపోతున్నారని చెప్తే ఐదు జాగాలలో ఫ్లైఓవర్లు నిర్మాణం చేయబోతున్నాం.. ఇక చావులు ఉండవు అని హామీ ఇస్తున్నాను. భారతీయ జనతా పార్టీ మాటకు కట్టుబడి ఉంటుంది.మాట ఇస్తే అమలు చేస్తుంది. నీటి సమస్య కమిటీ హాళ్ల సమస్య తీరుస్తాను. మీ ఆపదలో అవసరంలో మీ ఇంటికి కుటుంబ సభ్యునీలాగా ఉంటానని మాట ఇచ్చాను తప్పకుండా ఉంటాను. జవహర్ నగర్ డంపు యార్డు తొలగించే వరకు రాజీలేని పోరాటం చేద్దాం అని తెలిపారు.

ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని పంటల సాగు చేపట్టాలి

ఎల్కతుర్తి అక్టోబర్ 27 ప్రజా న్యూస్ నెట్వర్క్, రిపోర్టర్ బొంకూరి కార్తిక్:
హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామ లొ రైతులకు ఆరుతాడి పంటల గురించి అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మండల ఏఈఓ జక్కుల బాబు. మరియు ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రభావతి పాల్గొని మాట్లాడుతూ. రైతులు వచ్చే వేసంగి పంటలు నీటి లభ్యత చూసుకొని సాగు చేయాలని సూచించినారు. భూగర్భ జలాలు తగ్గినందున వరి పంట వేయకపోవడమే మంచిదని సూచించినారు. చిరుధాన్యాలు సాగు చేస్తే తక్కువ నీటితో పంటలు పండే అవకాశం ఉంటుందని ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపినారు. నీటిని పొదుపుగా వాడాలని అవసరం అయితే సింక్లర్స్ డ్రిప్స్ వాడాలని ప్రభుత్వం సబ్సిడీతో ఇస్తుందని తెలియజేసినారు. అవకాశం ఉన్న రైతులు ఆయిల్ ఫామ్ తోటలు పెట్టుకున్నట్లయితే తక్కువ నీటితో ఎక్కువ రాబడి ఉంటుందని దాదాపు 30 సంవత్సరాల వరకు రైతుకు ఆదాయం వస్తుందని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ జక్కుల బాబు. ఆయిల్ ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రభావతి. ఎండి మహమ్మద్ జాఫర్.



తంగిళ్ళ సురేష్ రైతులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు అజరామరం.. వారి సేవలు చిరస్మరణీయం

ఎస్పీ కొత్తపల్లి నరసింహ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా బైక్ ర్యాలీలు.. అమరులకు ఘన నివాళి

హుజూర్‌నగర్ మండలం, అక్టోబర్ 27, ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :
సూర్యాపేట జిల్లా ఎస్పీ కొత్తపల్లి నరసింహ ఆదేశాల మేరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీలు ఘనంగా నిర్వహించారు. ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలిచి, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ చేపట్టిన ఈ ర్యాలీలు పోలీసుల కర్తవ్యనిష్ఠకు, ప్రజా భద్రత పట్ల వారి అంకితభావానికి ప్రతీకగా నిలిచాయి.హుజూర్‌నగర్ పట్టణంలో పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి ఇందిరా చౌక్ వరకు బైక్ ర్యాలీ సాగగా, నూతన్‌కల్, నడిగూడెం, మద్దిరాల, పెన్‌పహాడ్, నాగారం మండల కేంద్రాలతో పాటు చిలుకూరు, గరిడేపల్లి, ఆత్మకూర్(ఎస్) పోలీస్ స్టేషన్ పరిధిలోని నేమిగల్ గ్రామంలోనూ ర్యాలీలు నిర్వహించారు. గరిడేపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలోనూ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ బైక్ ర్యాలీ చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించారు. పలుచోట్ల పోలీస్ సిబ్బంది బైక్‌లపై ర్యాలీగా వెళ్లి అమరవీరులకు నివాళులర్పిస్తూ నినాదాలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో జాతీయ జెండాలను చేతబట్టి అమరవీరుల సేవలను ప్రజలకు గుర్తుచేశారు. ఈ కార్యక్రమాల ద్వారా విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొనే సవాళ్లు, ప్రజల రక్షణ కోసం వారు చేస్తున్న సేవలు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు వ్యవస్థ పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ దేశ రక్షణ, ప్రజల భద్రత, సమాజంలో శాంతియుత వాతావరణం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. వారి ధైర్యసాహసాలు, క్రమశిక్షణ, అంకితభావం ప్రతి పోలీసు సిబ్బందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండటం, చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం, ప్రజల సమస్యలపై స్పందించడం ద్వారా వారికి నిజమైన నివాళి అర్పించగలమని స్పష్టం చేశారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడటంలో ప్రజల సహకారం కూడా కీలకమని, యువత దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను



అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు వారి త్యాగాలను స్మరించుకునే కార్యక్రమమే కాకుండా, ప్రజా రక్షణ కోసం పోలీసు శాఖ నిరంతరం నిర్వర్తిస్తున్న బాధ్యతను చాటిచెప్పే సందర్భంగా నిలిచాయి. ఈ కార్యక్రమాల్లో వివిధ మండలాల సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది, హోంగార్డులు, స్థానిక ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

ఆన్‌లైన్ గేమింగ్, ఓటీపీ మోసాల పట్ల జాగ్రత్త అవసరం నడిగూడెం ఎస్ఐ తేజస్విని

నడిగూడెం మండలం, అక్టోబర్ 27, ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :
సూర్యాపేట జిల్లా పరిధిలోని నడిగూడెం మండల కేంద్రంలో తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలలో సైబర్ నేరాల నివారణపై నడిగూడెం పోలీస్ స్టేషన్ ఎస్ఐ తేజస్విని, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సైబర్ భద్రత, ఆన్‌లైన్ గేమింగ్ వల్ల కలిగే నష్టాలు, ఓటీపీ మోసాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ముఖ్యంగా విద్యార్థులు అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్‌లో పరిచయాలు పెంచుకునేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ తేజస్విని సూచించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు. ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటు పడకుండా, తెలియని లింకులను క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలని హెచ్చరించారు.సైబర్ మోసానికి గురైనప్పుడు వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు సమాచారం అందించాలని వివరించారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు తమ కుటుంబ



సభ్యులు, స్నేహితులకు కూడా ఈ విషయాలపై అవగాహన కల్పించాలని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తేజస్విని, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

డిజిటల్ అరెస్ట్, లోన్ యాప్‌లు, ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్త అవసరం ఎస్ఐ హనుమాన్ నాయక్

హుజూర్‌నగర్ మండలం, అక్టోబర్ 27, ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :

సూర్యాపేట జిల్లా పరిధిలోని హుజూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు మంగళవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ హనుమాన్ నాయక్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేటప్పుడు వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.
ఈ సందర్భంగా ఎస్ఐ హనుమాన్ నాయక్ మాట్లాడుతూ ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, లోన్ యాప్‌ల ద్వారా వేధింపులు, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరిగే మోసాలు, ఫిషింగ్ లింకులు, సోషల్ మీడియా భద్రత వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. పోలీసులమని, ప్రభుత్వ అధికారులమని చెప్పుకుంటూ ఫోన్ చేసి బెదిరించడం, కేసుల పేరుతో డబ్బులు డిమాండ్ చేయడం వంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నిజమైన అధికారులు ఫోన్ ద్వారా డబ్బులు చెల్లించాలని బెదిరించే పరిస్థితులను నమ్మి మోసపోవద్దని సూచించారు.



గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని, బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చనే ఆశతో ఆన్‌లైన్ పథకాలు, లోన్ యాప్‌లను నమ్మడం ప్రమాదకరమని వివరించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు పంచుకునేటప్పుడు కూడా జాగ్రత్తలు పాటించాలని, ఏదైనా అనుమానాస్పద ఘటన ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు.
సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, సంబంధిత వివరాలను అధికారులకు అందించాలని తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండటమే కాకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా జాగ్రత్తలను తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ మోసాల పద్ధతులు కూడా మారుతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ సురక్షితమైన డిజిటల్ వినియోగాన్ని అలవర్చుకోవాలని పోలీసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నుంచి రాజేష్, సతీష్, వాణి తొలగింపు

(సంగారెడ్డి మండలం) అక్టోబర్ 27 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..
స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (SFI) విధివిధానాలు, క్రమశిక్షణ నియమాలు, సంస్థ ప్రమాణాలకు విరుద్ధంగా వ్యవహరించిన కారణంగా రాజేష్, సతీష్, వాణిలను ఎస్ఎఫ్ఐ నుంచి తొలగించినట్లు జిల్లా కార్యదర్శి టీ. అర్జున్ ఒక ప్రకటనలో తెలిపారు.ఇకపై రాజేష్, సతీష్, వాణిలకు ఎస్ఎఫ్ఐతో ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయాన్ని మిత్రులు, శ్రేయోభిలాషులు, విద్యాసంస్థల యాజమాన్యాలు గమనించాలని టీ. అర్జున్ విజ్ఞప్తి చేశారు.

సామాన్యులకు చంద్రబాబు సర్కారు భారీ ఊరట..

తక్కువ ధరకే నిత్యావసరాలు



రాష్ట్రంలో పెరుగుతున్న నిత్యావసరాల ధరల నుంచి సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ధరల నియంత్రణపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కందిపప్పు, పామాయిల్, గోధుమ పిండి వంటి సరుకులను అందుబాటు ధరలకు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వంపై నెలకు రూ.100 కోట్ల అదనపు భారం పడినా, ప్రజలకు మేలు చేకూర్చడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

దీపావళి నాటికి రేషన్ షాపుల్లో రాయితీ సరుకులు
నిత్యావసరాల ధరల నియంత్రణపై పౌరసరఫరాల శాఖ అధికారులతో సీఎం చంద్రబాబు మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.170 నుంచి రూ.200 పలుకుతున్న కందిపప్పును రేషన్ కార్డుదారులకు కేవలం రూ.100కే అందించాలని నిర్ణయించారు. అదేవిధంగా, లీటర్ పామాయిల్‌ను రూ.125కు, కిలో గోధుమ పిండిని రూ.25కే సరఫరా చేయాలని ఆదేశించారు. దీపావళి పండుగ నాటికి ఈ సరుకుల పంపిణీని ప్రారంభించేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ నిర్ణయం వల్ల లక్షలాది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ధరల భారం నుంచి పెద్ద ఊరట లభించనుంది.

'ధరణి' బియ్యం ఇక మండల కేంద్రాల్లోనూ..
ప్రభుత్వం 'ధరణి' బ్రాండ్ పేరుతో రైతు బజార్లలో విక్రయిస్తున్న నాణ్యమైన బియ్యాన్ని ఇకపై రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, మండల కేంద్రాలకు విస్తరించాలని సీఎం ఆదేశించారు. మొబైల్ వాహనాల ద్వారా ప్రజల వద్దకే వెళ్లి ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ.49, సూపర్ ఫైన్ రకాన్ని రూ.50 చొప్పున విక్రయించాలని స్పష్టం చేశారు. బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలను అదుపు చేసేందుకు రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ అసోసియేషన్లతో ప్రభుత్వం జరిపిన చర్చలు ఫలించాయి. బీపీటీ స్టీమ్ బియ్యాన్ని కిలో రూ.66కు, సాధారణ స్టీమ్ బియ్యాన్ని రూ.47కు మించకుండా విక్రయించేందుకు మిల్లర్లు అంగీకరించినట్లు అధికారులు సీఎంకు వివరించారు. పొరుగు రాష్ట్రాలకు ధాన్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా పటిష్టం చేయాలని చంద్రబాబు ఆదేశించారు.

ఉల్లి ధరల నియంత్రణకు చర్యలు
ఉల్లి ధరల నియంత్రణకు ప్రభుత్వం ఇప్పటికే జోక్యం చేసుకుని రైతు బజార్లలో కిలో రూ.35కే విక్రయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే మరో 800 మెట్రిక్ టన్నుల ఉల్లిని అందుబాటులోకి తెచ్చి ధరలు మరింత తగ్గేలా చూస్తామని హామీ ఇచ్చారు. కర్నూలు నుంచి కొత్త పంట మార్కెట్‌కు వస్తే ధరలు పూర్తిగా అదుపులోకి వస్తాయని అంచనా వేశారు.

నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నిరంతరం పర్యవేక్షించాలని, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా తక్షణమే జోక్యం చేసుకోవాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతున్నప్పటికీ, ధరల పెరుగుదల నుంచి ప్రజలను కాపాడటమే తమ ప్రథమ కర్తవ్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, పౌరసరఫరాల శాఖ కార్యదర్శి కన్నబాబు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జగన్ ఉడత బెదిరింపులకు భయపడేవారు ఇక్కడ ఎవరూ లేరు : మంత్రి అచ్చెన్నాయుడు



వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ ఉడత బెదిరింపులకు, హెచ్చరికలకు భయపడేవారెవరూ ఇక్కడ లేరని, ఇది ప్రజాస్వామ్యం తప్ప జమీందారీ రాజ్యం కాదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు అచ్చెన్నాయుడు సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేశారు.
"వడ్డీతో సహా చెల్లిస్తాం", "ఇప్పుడు మీ టైం.. తర్వాత మా టైం" వంటి హెచ్చరికలను మానుకోవాలని అచ్చెన్నాయుడు హితవు పలికారు. ప్రజాస్వామ్యంలో తుది తీర్పు ఇచ్చేది ప్రజలేనని గుర్తుంచుకోవాలన్నారు. గత ఐదేళ్ల దారుణ పాలనపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక, అధికారులను, పోలీసులను బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి అభ్యర్థి పూర్తి స్వేచ్ఛతో నామినేషన్ వేస్తున్నారని, తమ పాలనకు, గత పాలనకు ఉన్న తేడా ఇదేనని పేర్కొన్నారు.గతంలో జరిగిన హింసాత్మక ఘటనలను ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. సొంత పార్టీ ఎంపీటీసీ అభ్యర్థిపై వైసీపీ నేతలు దాడి చేసినా, పుంగనూరులో మిథున్‌రెడ్డి హింస సృష్టించినా జగన్‌కు కనపడలేదా అని ప్రశ్నించారు. మాచర్లలో బోండా ఉమ, బుద్ధా వెంకన్నలపై జరిగిన దాడులను, ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్‌ను తొలగించేందుకు తెచ్చిన నల్ల ఆర్డినెన్స్‌ను ప్రజలు మర్చిపోలేదన్నారు.జగన్ తన నైజాన్ని మరోసారి బయటపెట్టుకున్నారని, ఎన్ని పాదయాత్రలు చేసినా, పొర్లుదండాలు పెట్టినా ప్రజలు ఇక నమ్మరని విమర్శించారు. "సొంత చెల్లి, మేనకోడలిపైనే కక్ష సాధించే సైకో, దుర్మార్గుడు రాష్ట్ర ప్రజలకు ఏం మేలు చేస్తాడు? తండ్రిలాంటి మేనమామ స్థానంలో ఉండి, సొంత మేనకోడలి వివాహానికే అడ్డంకులు సృష్టిస్తున్నావంటే నీ రాక్షసత్వం అర్థమవుతోంది" అంటూ అచ్చెన్నాయుడు తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు.

ఎండిన పంట పొలాల కోసం బీరం హర్షవర్ధన్ రెడ్డి పాదయాత్ర

చిన్నంబావి మండలం ప్రజా న్యూస్ అక్టోబర్ 27

ఎకరాకు రూ. 20 వేల నష్టపరిహారం చెల్లించాలి.. చిన్నంబావిని కరువు మండలంగా ప్రకటించాలి

రైతులతో కలిసి పంట పొలాల పరిశీలన.. తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పణ మండలంలో సాగునీరు, విద్యుత్ కొరతతో ఎండిపోతున్న పంట పొలాలను పరిశీలిస్తూ కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి రైతులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. చెల్లెపాడు గ్రామం నుంచి సోమవారం ఉదయం 8.30 గంటలకు ప్రారంభమైన మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు చిన్నంబావి తహసీల్దార్ కార్యాలయం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, చిన్నంబావి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఎండిన పంటలను చూసి రైతులకు భరోసా

చెల్లెపాడు గ్రామం నుంచి ప్రారంభమైన పాదయాత్ర కాలూరు, అయ్యవారిపల్లి, వెల్లటూరు, చిన్నమారు, పెద్దమారు గ్రామాల మీదుగా చిన్నంబావి మండల కేంద్రానికి చేరుకుంది. మార్గమధ్యంలో రహదారికి ఇరువైపులా ఉన్న పంట పొలాలను సందర్శించిన బీరం హర్షవర్ధన్ రెడ్డి ఎండిపోయిన పంటలను పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి సాగు కోసం చేసిన పెట్టుబడులు, ఇప్పటివరకు అయిన ఖర్చులు, సాగునీటి లభ్యత, విద్యుత్ సరఫరా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.పంటలు ఎండిపోవడంతో తీవ్ర ఆందోళనలో ఉన్న రైతులను ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. రైతులతో కలిసి పంట పొలాల్లోనే భోజనం చేస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసిన రైతులకు పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేకపోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఎకరాకు రూ. 20 వేల పరిహారం చెల్లించాలి

చిన్నంబావి మండలంలో ఎండిపోయిన పంట పొలాలను ప్రభుత్వం వెంటనే సర్వే చేయించాలని బీరం హర్షవర్ధన్ రెడ్డి కోరారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రతి ఎకరాకు రూ. 20 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

సాగునీరు అందక, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. వ్యవసాయాన్ని నమ్ముకుని పంటలు వేసిన రైతులకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పంటలు ఎండిపోతున్న సమయంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని సూచించారు.

సాగునీరు, విద్యుత్‌పై రైతుల ఆవేదన

పాదయాత్ర సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగునీరు, 24 గంటల విద్యుత్ సరఫరా అందేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సాగునీరు, విద్యుత్ కోసం ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. కనీసం ఆరు గంటల విద్యుత్ కూడా సక్రమంగా అందడం లేదని పలువురు రైతులు తమ సమస్యలను వివరించారు.

సాగునీరు అందక పంటలు ఎండిపోవడంతో పెట్టిన పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ పంటలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ తీరుపై బీరం హర్షవర్ధన్ రెడ్డి విమర్శలు

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, సాగునీరు, విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం





ముందస్తు ప్రణాళికతో వ్యవహరించకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సొంత మండలంలోనే పంటలు ఎండిపోతున్నా రైతుల సమస్యలపై తగిన శ్రద్ధ చూపడం లేదని ప్రశ్నించారు. రైతుల కష్టాలను ప్రభుత్వం తక్షణమే గుర్తించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఎండిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు ఎకరాకు రూ. 20 వేల చొప్పున పరిహారం అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. ఆరుతడి పంటలకు అవసరమైన సాగునీటిని అందించడంతో పాటు వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.రైతుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రైతులతో కలిసి మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం

పాదయాత్ర ముగింపు సందర్భంగా చిన్నంబావి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌ను కలిసి బీరం హర్షవర్ధన్ రెడ్డి వినతిపత్రం సమర్పించారు. ఎండిన పంటలపై సమగ్ర సర్వే నిర్వహించి, నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. చిన్నంబావి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో పాటు సాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.రైతులు, బీఆర్ఎస్ నాయకుల భారీ గా పాల్గొనడం ఈ పాదయాత్రలో కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, వివిధ మండలాల పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, ఉమ్మడి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, చిన్నంబావి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఈదన్న యాదవ్, దేగ శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శంకర్, బాలస్వామి, శరత్ రెడ్డి, మాజీ సర్పంచ్ రంజిత్ కుమార్, తగరం కురుమయ్య, నరేందర్ రెడ్డి, గూడెపు శివారెడ్డి, నాగిరెడ్డి, మద్దిలేటి, ఆనంద్ యాదవ్, ఉగ్ర నరసింహ, వడ్డేమాన్ రామకృష్ణ, వంశీ తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు.ఎండిన పంటలకు నష్టపరిహారం, సాగునీరు, విద్యుత్ సమస్యల పరిష్కారమే ప్రధాన డిమాండ్లుగా సాగిన ఈ పాదయాత్ర ద్వారా రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు.

నామినేషన్లు వేయడానికి యుద్ధం చేయాల్సి వస్తోంది: వైఎస్ అవినాశ్ రెడ్డి



ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో అధికార కూటమి ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతోందని వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ అధినేత జగన్ అధ్యక్షతన పులివెందులలో జరిగిన పార్టీ ముఖ్య నేతల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అధికార దుర్వినియోగంతో ఎన్నికలు నిర్వహిస్తున్నారని, నామినేషన్ వేయాలంటేనే యుద్ధం చేయాల్సిన దుస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.“స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ అరాచకాలు సృష్టిస్తోంది. వైసీపీ అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకున్నారు. కార్యకర్తలపై దాడి చేసి, బాధితులపైనే తిరిగి తప్పుడు కేసులు బనాయిస్తున్నారు“ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా, బెదిరింపులకు పాల్పడినా తాము భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు.

బడులు పెట్టి చేతులు దులుపుకొంటే సరిపోదు..

రేవంత్ సర్కార్‌పై ఆకునూరి మురళి తీవ్ర విమర్శలు

- విద్యా వ్యవస్థలో లోపాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ ఐఏఎస్
- పిల్లల భద్రతపై ప్రభుత్వానికి నిబద్ధత ఉండాలంటూ వ్యాఖ్యలు
- తెలంగాణ ఫౌండేషన్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్
- విద్యా బడ్జెట్ పెంచాలని, స్కూల్ బస్సులు ఏర్పాటు చేయాలని సూచన
- ఐదేళ్ల విద్యా ప్రణాళిక అమలు చేయాలని విజ్ఞప్తి



ఖమ్మం జిల్లాలో ఐదేళ్ల చిన్నారి ధనశ్రీ మృతి ఘటనపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో పిల్లలకు సరైన వసతులు, భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. పిల్లల విద్య, భద్రత విషయంలో ప్రభుత్వానికి అవసరమైన నిబద్ధత కనిపించడం లేదని వ్యాఖ్యానించారు.

ఖమ్మం జిల్లా కేవీపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో విషకీటకం కుట్టడంతో ఐదేళ్ల ధనశ్రీ మృతి చెందిన ఘటనపై మురళి ‘ఎక్స్’ వేదికగా స్పందించారు. “సారీ తల్లీ ధనశ్రీ.. నిన్ను ఈ ప్రపంచానికి దూరం చేసుకున్నాం. అన్ని బడుల్లో మంచి వసతులతో కూడిన ప్రీప్రైమరీ తరగతులు, గదులు ఉండి ఉంటే నువ్వు ఈ రోజు బతికి ఉండేదానివి” అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.పిల్లల విద్య, భద్రత ప్రభుత్వానికి ప్రాధాన్య అంశాలు కావాలని ఆకునూరి మురళి సూచించారు. కనీస సౌకర్యాలు లేని ప్రీప్రైమరీ పాఠశాలలను ప్రారంభించి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. రాష్ట్రంలోని 60 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా కమిషన్ సిఫార్సుల ప్రకారం నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులతో తెలంగాణ ఫౌండేషన్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు విద్యా బడ్జెట్‌ను పెంచాలని, విద్యార్థుల సౌకర్యార్థం స్కూల్ బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం తక్షణమే ఐదేళ్ల ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కోరారు.మరోవైపు, అంగన్‌వాడీ టీచర్ స్థానికంగా ఉండకపోవడం, నిర్లక్ష్యం కారణంగానే చిన్నారి మృతి చెందిందని స్థానికులు ఆరోపించారు. టీచర్‌పై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తల్లిదండ్రులతో కలిసి టేకులపల్లి రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ నిరసనకు రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

విద్యార్థులకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన

– మాదకద్రవ్యాల వినియోగం, మైనర్ డ్రైవింగ్‌పై హెచ్చరిక..
– బాలలు, మహిళల రక్షణపై పోలీసుల సూచనలు

తిరుమలగిరి మండలం, అక్టోబర్ 27, ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :

సూర్యాపేట జిల్లా పరిధిలోని తిరుమలగిరి మండలంలోని వశిష్ట పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, యాంటీ డ్రగ్స్, మైనర్ డ్రైవింగ్ ప్రమాదాలు, బాలలు, మహిళల రక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. చిన్న వయస్సులోనే భద్రతా నియమాలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని పోలీసులు సూచించారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని, తెలియని లింకులను క్లిక్ చేయవద్దని తెలిపారు. రోడ్డు భద్రతలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్ ధరించడం, వాహనాలు నడిపేటప్పుడు బాధ్యతగా వ్యవహరించడం అవసరమని వివరించారు. మైనర్లు డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు వాహనాలు ఇవ్వడంలో జాగ్రత్త వహించాలని సూచించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగం ఆరోగ్యం, చదువు, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. బాలలు, మహిళల రక్షణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పిస్తూ, ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు నేర్చుకున్న విషయాలను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా



తెలియజేసి సమాజంలో భద్రతపై అవగాహన పెంపొందించాలని పోలీసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని తిరుమలగిరి ఎస్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీ లిక్కర్ స్కామ్ : రాజ్ కెసిరెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట..

ఏపీ ప్రభుత్వానికి చుక్కెదురు



ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్ కెసిరెడ్డికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనకు ఏపీ హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. అయితే, విచారణ పూర్తయ్యే వరకు కెసిరెడ్డి దేశం విడిచి వెళ్లరాదని, దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని స్పష్టమైన షరతులు విధించింది.ప్రొడక్షన్ వారెంట్ జారీని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అరెస్ట్ చేయబోమని కోర్టులో హామీ ఇచ్చాక కూడా ప్రొడక్షన్ వారెంట్ జారీ చేయడంపై వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా హైకోర్టు తీర్పులోని కొన్ని వ్యాఖ్యలతో తాము ఏకీభవించడం లేదని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. అయితే, కేవలం ఆ కారణంతో నిందితుడికి మంజూరు చేసిన బెయిల్‌ను, స్వేచ్ఛను రద్దు చేయలేమని స్పష్టం చేసింది. పోలీసులు నేరుగా చేసే అరెస్ట్‌కు, కోర్టు జారీ చేసే ప్రొడక్షన్ వారెంట్‌కు మధ్య వ్యత్యాసం ఉందని వ్యాఖ్యానించింది.ముందస్తు అనుమతి లేకుండా నిందితుడిని మళ్లీ అరెస్ట్ చేయరాదని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లోని 23వ పేరాను సుప్రీంకోర్టు సమర్థించింది. ఒకవేళ నిందితుడు దర్యాప్తునకు సహకరించని పక్షంలో, బెయిల్ రద్దు కోసం మళ్లీ కోర్టును ఆశ్రయించే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ తీర్పుతో కెసిరెడ్డికి హైకోర్టు ఇచ్చిన బెయిల్ కొనసాగనుంది.

కేటీఆర్, హరీశ్ రావు భ్రమల్లో ఉన్నారు : మహేశ్ గౌడ్

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుస్తుందని మహేశ్ గౌడ్ ధీమా
- తెలంగాణలో బీజేపీ పని అయిపోయిందని వ్యాఖ్య
- ఆలోచన లేకుండా అప్పులు చేసి కేసీఆర్ రాష్ట్రాన్ని ముంచారని ఆరోపణ



బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు ఇంకా భ్రమల్లోనే జీవిస్తున్నారని, క్షేత్రస్థాయి వాస్తవాలను వారు గ్రహించడం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుచుకోవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.మేధావి అని చెప్పుకునే కేసీఆర్ ఎలాంటి ఆలోచన లేకుండా అప్పులు చేశారని మహేశ్ గౌడ్ విమర్శించారు. ఎల్ నినో ప్రభావం దేశవ్యాప్తంగా ఉంటే, దాని గురించి హరీశ్ రావు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, 90,000 ఉద్యోగాలు పొందిన ప్రతి లబ్ధిదారుడు కాంగ్రెస్‌కే ఓటు వేస్తారని... క్షేత్రస్థాయిలో తమ పార్టీ బలంగా ఉందని చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని... దేశంలో ఎక్కడా లేనంతగా తమ పార్టీలో సమన్వయం ఉందని మహేశ్ గౌడ్ తెలిపారు. నవంబర్‌లో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఆ తర్వాత తమ ప్రత్యక్ష లక్ష్యం ఎన్నికలేనని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని, ఆ పార్టీ పని అయిపోయిందని జోస్యం చెప్పారు. ప్రస్తుతం ఉన్న 8 ఎంపీ సీట్లలో రెండు కూడా గెలవడం కష్టమేనని.. మరోవైపు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలలో ఒక్కరు కూడా గెలవరని అన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 40 శాతం సీట్లు తమకే వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.